# దృశ్యం

**ఈ మధ్య రామారావుకి** నిద్ర పట్టటం లేదు. నిద్ర లేని రాత్రుళ్ళలో చాలాసేపు మెలకువగానే గడుపుతున్నాడు. అటువేపు ఒత్తిగిలి పడుకోవటం ఎక్కువ కనపడుతుం...

పెరటి గుమ్మంలోంచి ఆ యింటిని చాలాసార్లు చూశాడు. ..., చిన్న సంసారం.... యీ మధ్యే కట్టుకున్నారు ఆ ఇల్లు... భార్యా భర్తా... యిద్దరు పిల్లలు... చాలా అందమైన సంసారం ...క్కది.

పెరటి వేపు రాగానే అసంకల్పితంగా యింటి వేపు చూడ్డం అలవాటై యింది. ఆ రాత్రీ అలాగే చూశాడు... వరండాలో ఒంటరి కుర్చీ... కుర్చీలో చలనం లేని బొమ్మలా ముసలావిడ.... కాస్సేపు అలా చూశాక ... ఆవిడలో చలనం కనిపించింది. తెల్లటి జుట్టు కప్పు ... రాత్రి యింకేం కనపడలేదు...ఆ మర్నాడు భార్య నడిగాడు .... "అర్ధరాత్రయినా ఎవరా ముసలావిడ ... అలా కూచుంది ...." అని.

ఆ యింటావిడ తల్లి ... యీమధ్యే హాస్పిటల్ నుంచి తీసుకొచ్చారు ... మనసుకి యిక్కట్టింది కనపడదు. ...టిపక్క తలమీద దెబ్బలేదు. పెద్ద ఆపరేషన్ చేశార్ట. కేన్సరసీ, ఎన్నాళ్ళో బతకదని అన్నారట...."

అలా చెపుతున్న భార్య గొంతులో దిగులు ధ్వనించింది రామారావుకి. ఆ తర్వాత రాత్రులు, అలా ఒంటరిగా కుర్చీలో....ఆ ముసలావిడ చాలాసార్లు కనిపించింది.

యీమధ్య ఆర్థిక పరమైన రామారావు ఆలోచనల్ని తక్కించుకు ... అయ్యాయి. కష్టపడ్డం తప్పటం లేదు ... ఫలితం దక్కటం లేదు...నానా రకాల వృత్తులు, ఎన్నెన్ని చేస్తే గాని సంపాదించటం కుదరటం లేదు. అలా సంపాదించిందే అందాల రూపంలో, మెట్టెల రూపంలో మంచి నీళ్ళలా ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. మనసుని పూర్తిగా చంపుకుని నాటకాలు చెయ్యలేడు. చేతులు కట్టుకుని చేతకాని వాడిలా కూచోనూలేడు. అంతర్గతమైన ఆందోళన ... ఆ ఆందోళన వల్ల ఏపని చెయ్యాలన్నా ఉత్సాహం వుండటం లేదు... ఏ ఆలోచనా సాగటం లేదు.

ఏం తోచక రాత్రుళ్ళు పెరట్లో తిరిగే రామారావు ఆలోచనల్ని ఆ ముసలావిడ పట్టుకుంది.

"రాత్రుళ్ళు గంటలు ... గంటలు ఒంటరిగా ఎలా కూచుంటుందో ... ఏం ఆలోచిస్తుందో ... తెలిసీ తెలియని చావు గురించా ... మనిషినుంచి విడిపోని జ్ఞాపకాల గురించా ... తనవాళ్ళ గురించా.... ఒకవేళ బాధేమో. శారీరకంగా ఎక్కడో తనలోనో ... గుండెల్లోనో ... మరో

**వి. రాజారామమోహనరావు**

బాధా ... తట్టుకోలేని నెప్పేమో ... రాత్రి సాయంత్రో ... ఆ పసారా సాయంలో యింట్లోవున్న తన వాళ్ళకి యిబ్బంది కలిగించ కూడదని.... బాధని తన లోపలే దాచుకుంటోందేమో ... తెల్లవార్నాక ... అందులో ఆ స్థితిలో బాధ వుండదా ... వున్నా లేకపోయినా యింట్లోవాళ్ళని లేపి తనతో వుండమని గొడవ చెయ్యొచ్చుగా .... అయినా అంత బాధలోనూ ... తనవాళ్ళమీద ఎంత ప్రేమ ... ".... ప్రేమ అన్న భావనలో రామారావు తన జీవితంలోకి వచ్చేశాడు.

నిజమే ప్రేమే జీవితాన్ని నడుపుతుంది. తనవాళ్ళకి యింకా సుఖాల్ని. యింకా సౌకర్యాలని కూర్చి పెట్టాలని తాపత్రయం రానీపోలే తనకి మాత్రం ఎందుకీ తపన ....

రాత్రీ పగళ్ళు మధ్య జీవితం దొర్లుతూనే వుంది. మామూలు బతుక్కి కావలసినవన్నీ వుంది ... పొందుతూ .... యింకా ఏదో లోటు. గట్టిగా బాధ పెట్టని అస్థిమితంలో రామారావుకి రాత్రులు గడుస్తూనే వున్నాయి.

కొన్నాళ్ళకి ... ఆ ముసలావిణ్ణి అలా వొంటరిగా మాట్లాడ్డంకూడా అర్థంకాని బాధలా మారింది రామారావుకి.

"ఓసారి వెళ్ళి ... ఆవిడతో మాట్లాడి వస్తే .... అనుకున్నాడు ఏదో భయం... పిరికితనం .... అనాహ్లాద విషయం ఎందుకులే అన్న నాగరికపు తెలివితేటలు....

రామారావు భార్య ఆ యింటికెళ్ళి ఆ ముసలావిడని పలకరించి వస్తూనే, వుంది. ఓ రోజు....

"ఆ ముసలావిడకి ఎంత తెలివండీ.... ఎన్ని విషయాల గురించి మాట్లాడుతుందో... తెలుగే కాదు... ఎంత చక్కటి ఇంగ్లీషో.... పెద్దావిడ నిండుగా బతికింది. ఆవిడ చచ్చిపోయినా పరవా లేదనుకోండి అయినా చచ్చిపోతుందంటే అందరికీ బాధే... ఎవరేంచేస్తాం చెప్పండి. చావుని ఎవరం మాత్రం తప్పించగలం...." అని రామారావు అడక్కుండానే వివరాలు చెప్పి, మరు నిమిషంలోనే ఏదో యింటి పనిలో మునిగి పోయింది లక్ష్మి.

"లక్ష్మి ధోరణి ఎంత చిత్రం...." అనుకున్నాడు రామారావు. "సో సింపుల్... అమ్మా అంటే ఎవరికేనా కష్టం వొచ్చిందని తెలిస్తే పని కట్టుకుని వెడుతుంది. అక్కడ వాళ్ళని వోదార్చి యింటికొచ్చి వాళ్ళ కష్టానికి బాధపడి... వినేవాళ్ళుంటే అవన్నీ చెప్పి తెల్లారేసరికి ఆ గొడవ మరిచి పోతుంది .... వాళ్ళకీ తనకీ ఏమిటి తేడా...ఎంతో సింపుల్‌గా అనిపించే ఆ జీవితం తన కెందుకు అందుబాట్లోకి రావటం లేదు ...

ముసలావిణ్ణి చూసిందగ్గర్నించీ కేన్సర్ గురించి ఆలోచన ... సరైన వైద్యం లేనివాళ్ళు ఎందరో...."ఎలాగూ చచ్చిపోయే కేసే ట్రీట్‌మెంట్ ఎందుకులే..." అని నిర్ణయించుకుని ఏదో వొంకతో పంపించేసే డాక్టర్లు ఎందరో అమానుషం అయినా ... చచ్చేంత వరకేనా వీలున్నంత వరకూ బాధని తగ్గించాలని అందరికీ ఎందుకు అనిపించదో ?

పేద వాళ్ళయితే మరీను... అంత దారుణమైన రోగం వచ్చిన వ్యక్తిని కనీసం చచ్చి పోయే వరకేనా జాగ్రత్తగా చూసుకోలేని మనం ...

అసలు కేన్సరేమిటి... యింకా ఎన్ని

దారుణాలు లేవు...నిత్యం కేన్సర్‌కన్నా అన్యాయంగా బతుకు చావుని అనుభవిస్తున్న వాళ్ళు ఎందరు లేరు .... పైగా కరువులు...వరదలు ... గొడవలు... అల్లర్లు....యిన్నింటి మధ్యా ఎవరికి కావల్సింది వాళ్ళకే ... తనుమాత్రం ఏం లోటుగా బతుకుతున్నాడు...

అయినా ఎందుకీ ఆలోచన ... ఏం చెయ్యలేనప్పుడు యిదంతా ఆ ముసలావిడ శారీరక ఇన్సోమ్నియాలా తన మానసిక ఇన్సోమ్నియాయేమో అనిపించింది రామారావుకి.

"వుద్యోగం వుంది ... సంసారం వుంది. రోజు గడుస్తూనే వుంది. విశ్రాంత కాలక్షేపానికి న్యూస్ పేపర్ వుంది. క్రికెట్ ... లైవ్ టెలికాస్ట్‌లూ వున్నాయి. మరి కొన్నాళ్ళకి ఆ ముసలావిడ ఎలాగూ చచ్చిపోతుంది. ఎందుకీ గొడవ ..." అని బలవంతంగా మళ్ళీ అనుకున్నాడు.

అయినా ఏదో తెలియని ఆరాటం... రాని నిద్ర పోవాలని, బతుకులో యిమిడి పోవాలని ప్రయత్నించినా రామారావుకి కుదరటం లేదు...ఆ యింటిని చూస్తూనే వున్నాడు....అందమైన ఆయింటి సంసారంలో ఆ ముసలావిడలా ... అతని లోలోపలే ఏదో బాధ ... ప్రయత్నాల మధ్య రోజులు గడుస్తూనే వున్నాయి....

ఆ ముసలావిడ కొడుకింటికి వెళ్ళిపోయిందని తెలిసింది. లక్ష్మి వో రకంగా బలవంతంగానే రామారావుని వాళ్ళింటికి తీసికెళ్ళింది. పెద్దగా ఎవరితోటి ఎక్కువ మాటలు సాగక పోయినా అంత యిబ్బంది అనిపించలేదు.

తిరిగి వచ్చేసే ముందు... "మీ అబ్బాయి దగ్గరికి వెళుతున్నారటగా..." అడిగాడు రామారావు ఆ ముసలావిడతో ఏదో ఒకటి మాట్లాడాలనే ధోరణిలో

"అవును... వాడు దగ్గర కూడా కొన్నాళ్ళు వుండాలిగా బాబూ...వెళ్ళొస్తాను..." అంది ముసలావిడ నవ్వుతూ. లైఫ్ యీజ్ లీడ్ అన్నట్టు కనపడింది. ఆ నవ్వు రామారావుకి.

అన్నాళ్ళ తన అలజడిలోంచి ఒక్కసారి పులిక్కి పడ్డాడు రామారావు. కన్నీళ్ళల్లో, కలతల్లో కూడా వుండే వెలుగు తనని స్పృశించినట్టైంది రామారావుకి...నా వాళ్ళు అన్న శక్తి...అనుబంధంలోంచి సహజమైన అనుభవంతోంచి వెనవేసుకున్న దీర్ఘప్రయాణ సారంలా కనిపిస్తోంది. ఆ ముసలావిడ... 'ఆవిడున్న పరిస్థితితో పోలిస్తే తన అలజడి ఎంత అర్థరహితం... మనోబంధాన్ని గుర్తించని తన చూపెంత పరుష సంపాదించి యివ్వటమే తప్ప... వున్నది అందుకోలేని తాపత్రయం...' తిరిగి వస్తున్న దారంతా లక్ష్మి ఏవేవో చెపుతూనే వుంది.రామారావుకి ఆ మాటలు ముఖ్యమైనవి కావు...కానీ చెప్పటంలో పంచి యివ్వటంతో ధీమా....ఆ మాటలు వింటుంటే కొత్త ధైర్యం అనుభవిస్తున్నట్టుంది రామారావుకి.

ఎంత కాలంగానో కూరుకు పోయిన అలజడిలోంచి. అర్థం చెప్పుకో లేనిదైనా హాయైన మనో స్థితిలోకి ప్రయాణిస్తున్నట్టుంది. చాలా ఏళ్ళకి తిరిగి పక్కనే నడుస్తున్న లక్ష్మి చెయ్యిని రోడ్డుమీద తన చేతిలోకి తీసుకున్నాడు రామారావు వో క్షణం....వో అడుగు ఆగి...అర క్షణం అయోమయంగా చూసి తిరిగి మాట్లాడ్డం ఆరంభించింది లక్ష్మి... ●